ఈనాడు నంద్యాల

మంగళవారం అక్టోబరు 8, 2024

మేమే నిర్వహిస్తాం.. మీరు దరఖాస్తు చేయొద్దు

■ తెదేపా వారికీ తప్పని తిప్పలు



ఈనాడు, నంద్యాల : “నియోజకవర్గంలోని మద్యం దుకాణాలు మేమే నిర్వహించుకుంటాం. ఎవరూ దరఖాస్తు చేసేందుకు వీల్లేదు... దరఖాస్తు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని కర్నూలు జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి అనుచరులు హెచ్చరికలు జారీ చేశారు. ఆబ్కారీ శాఖ అధికారులూ సదరు ప్రజాప్రతినిధి అనుచరులతో కుమ్మక్కై దరఖాస్తులు స్వీకరించడంలేదన్న ఆరోపణలున్నాయి. దరఖాస్తు తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు వెళ్తే “ ఎమ్మెల్యే అనుమతి ఉందా ? ఒకసారి వెళ్లి కలవండని’ అధికారులు సూచిస్తుండటం గమనార్హం. సదరు నియోజకవర్గంలోని ఎక్సైజ్ స్టేషన్ల వద్ద ఆ ప్రజాప్రతినిధి అనుచరులు సోమవారం కాపు కాశారు. మద్యం దుకాణాల కోసం పలువురు దరఖాస్తు చేసేందుకు ప్రయత్నించగా కార్యాలయం లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. తెదేపా అనుకూల వ్యాపారులూ ఆ నియోజకవర్గంలో దరఖాస్తు చేయలేకపోయారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అడుగడుగునా బెదిరింపులే

రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటుకు అప్పగిస్తోంది. ఇందులో భాగంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తుదారుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సేవలను అందుబాటులో తెచ్చింది. అయినప్పటికీ కొందరు ప్రజాప్రతినిధులు పలువురిని బెదిరిస్తూ దరఖాస్తు చేయనీయకుండా చూస్తున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 99 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా ఆదివారం వరకు 19 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. సోమవారం కొన్ని దరఖాస్తులు వచ్చాయి.

అందరూవాటా ఇవ్వాల్సిందే

● నంద్యాల జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయనప్పటికీ 25 శాతం వాటా ఇవ్వాలని చెబుతున్నారన్న ఆరోపణలున్నాయి. అందుకు ఇష్టమైతేనే దరఖాస్తు చేసుకోవాలంటూ అనధికారిక హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు ప్రచారం ఉంది.

● కర్నూలు జిల్లాకు చెందిన ఓ తెదేపా నేత తన నియోజకవర్గ పరిధిలోని కొన్ని దుకాణాలకు దరఖాస్తులు చేయొద్దని హెచ్చరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయా దుకాణాలు తన మనుషులే నిర్వహించుకుంటారని చెబుతుండటంతో వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. ఆయన్ను కాదని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా క్షేత్రస్థాయిలో వ్యాపారం చేసుకునే పరిస్థితి ఉండదని భావిస్తున్నారు.

ఆనకట్ట భద్రతపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల ఆరా

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం ఆనకట్ట భద్రత, ఇక్కడ చేపట్టాల్సిన మరమ్మతు పనులపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ఆరా తీసింది. సున్నిపెంటలోని వ్యూపాయింట్ అతిథిగృహంలో శ్రీశైలం ఆనకట్ట అధికారులతో బృందం సభ్యులు సోమవారం సమావేశమయ్యారు. ఆనకట్ట, ప్లంజ్‌పూల్, తదితర అంశాలపై చర్చించారు. ముఖ్య ఇంజినీర్ (సీఈ) కబీర్‌బాషా మాట్లాడుతూ. ఆనకట్టకు సంబంధించి గతంలో రూ.203.95 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. తొలిదశలో చేపట్టాల్సిన రూ.102.58 కోట్ల పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రతినిధుల బృందం వచ్చిందన్నారు. ప్రతినిధులు రమేశ్ ముకల్లా, రాజగోపాల్‌సింగ్, ఆండీ జలిన్సకీ, హనే, రాష్ట్ర ఆనకట్ట భద్రత సీఈ కుమార్, ఎస్ఈ యాస్థిక, శ్రీశైలం ఆనకట్ట ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఈఈ మెహన్ తదితరులున్నారు.



ఆనకట్ట నమూనాను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం

పట్టాలు తప్పిన భూసేకరణ

■ సబ్ డివిజన్ మరిచిన అధికారులు ■ సర్వే నంబర్లన్నీ రెడ్‌మార్కులో ■ నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వేలైన్ భూ బాధితుల ఇబ్బందులు

నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వేలైన్ నిర్మాణంలో ‘భూ’సేరణ పట్టాలు తప్పింది.. 84 కి.మీ మేర 1,500 ఎకరాలను రెండు దశాబ్దాల కిందట సేకరించారు. సేకరించడంతో తమ బాధ్యత పూర్తి అయ్యిందని రెవెన్యూ యంత్రాంగం.. పరిహారం చెల్లించడంతో తమకేమి సంబంధం లేదని రైల్వే అధికారులు వ్యవహరించడంతో కొత్త చిక్కులు తలెత్తాయి. పొలాలను సబ్ డివిజన్ చేయలేదు. సర్వే నంబర్ల వారీగా భూసేకరణ చేసినా.. ఏ రైతు పొలం ఎంత సేకరించారు. భవిష్యత్తు అవసరాలకు తీసుకున్న భూమి ఎంతో దస్త్రాల్లో పొందుపరచలేదు. ఒక రైతుకు రెండెకరాల పొలం ఉంటే కొన్నిచోట్ల 30 నుంచి 40 సెంట్ల స్థలం మాత్రమే సేకరించారు. దీనిని సబ్ డివిజన్ చేయకపోవడంతో రెవెన్యూ దస్త్రాల్లో రెండెకరాల పొలం సేకరించినట్లు చూపుతోంది. సబ్ డివిజన్ చేయకపోవడంతో 20 ఏళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సమస్య పరిష్కారానికి ఎంపీలు చొరవ చూపాలని బాధిత రైతులు విన్నవిస్తున్నారు.

నంద్యాల పట్టణం, ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే :



ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరు గ్రామంలో రైల్వే లైన్

మండలం	భూసేకరణ గ్రామాలు
నంద్యాల	ఉడుమాల్పురం
పాణ్యం	తొగర్చేడు, కౌలూరు, మద్దూరు
బనగానపల్లి	టంగుటూరు, అనుపూరు, గులాబ్‌నబీపేట, కైప
సంజామల	సంజామల, ఎగ్గోని, గుంజలపాడు, చౌదరిదిన్నె
ఉయ్యాలవాడ	బొడెమ్మనూరు, రూపనగుడి, నొస్సం, అల్లూరు
కోవెలకుంట్ల	గుల్లదుర్తి, కోవెలకుంట్ల

రిజిస్ట్రేషన్ కుదరదన్నారు : నరసింహారెడ్డి, బోడెమ్మనూరు

సర్వే నంబరు 519లో 3.15 ఎకరాల భూమి ఉంది. ఇందులో 60 సెంట్ల స్థలాన్ని రైల్వేలైన్‌కు తీసుకున్నారు. మిగిలిన భూమిలో సగం నా చెల్లెలు రామలక్ష్మమ్మకు ఇవ్వాలనుకున్నా. రిజిస్ట్రేషన్ చేయడానికి వెళ్లితే అధికారులు కుదరదన్నారు. రైల్వేశాఖ నుంచి తగిన పత్రాలు తీసుకురావాలని చెబుతున్నారు. లేకపోతే అదనపు ఖర్చులు భరించాలని అంటున్నారు. దీంతో చేసేది లేక వెనుదిరిగాం.

రిజిస్ట్రేషన్లు జరగక అవస్థలు

రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా నంద్యాల, బనగానపల్లి, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని 40 గ్రామాల పరిధిలో భూమి సేకరించారు. సర్వే నంబర్ల వారీగా ప్రకటనలు జారీచేసి గ్రామాల వారీగా భూమి సేకరించారు. ఆయా సర్వే నంబర్లన్నింటినీ రెడ్‌మార్కులోనే ఉంచారు. దీంతో ఆయా సర్వే నంబర్లలోని భూమి మొత్తం సేకరించినట్లు ఆన్‌లైన్లో చూపుతోంది. ఉదాహరణకు ఒక సర్వే నంబరులో నలుగురు రైతులకు చెందిన 20 ఎకరాల భూమిలో 15 ఎకరాలు సేకరించినా సరే మొత్తం రెడ్‌మార్కులోనే ఉంచారు. మిగిలిన భూములు రైతులు విక్రయించేందుకు, బ్యాంకుల్లో రుణాలు పొందడానికి , మార్టిగేజ్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. “ “ పంట రుణాలు కూడా రావడం లేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని’’ బోడెమ్మనూరుకు చెందిన కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్ డివిజన్ చేయకుండా కొర్రీలు

● సాధారణంగా ఒక సర్వే నంబరు భూమిలో క్రయవిక్రయాలు జరిగితే సబ్ డివిజన్ జరుగుతుంది. రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా భూములను సేకరించిన అధికారులు సబ్ డివిజన్ చేయలేదు. దీంతో ఎంత భూమి సేకరించారు? మిగులు భూమి ఎంత? సరిహద్దులు వంటివి తేల్చకపోవడంతో 28 గ్రామాల రైతులు ఇబ్బంది పడుతున్నారు.

● ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరులో సర్వే నంబరు 567, 496, 497, 498, 505, 507లో భూమి సేకరించారు. ఈ సర్వే నంబర్ల పొలాల మధ్యలో రైల్వే లైన్ వేశారు. భూసేకరణ కొంత వరకే జరిగింది. సబ్ డివిజన్ చేయకపోవడంతో పై సర్వే నంబర్లలో ఉన్న మొత్తం భూమి సేకరించినట్లుగా దస్త్రాల్లో చూపుతోంది. ఈ గ్రామంలో 50 ఎకరాల భూమి సేకరించగా మొత్తం 100 ఎకరాల వరకు రెడ్‌మార్కులో పెట్టారు. దీంతో మిగతా 50 ఎకరాలకు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో వీటి క్రయ, విక్రయాలు జరగడం లేదు.



మాట్లాడుతున్న కలెక్టర్ జి.రాజకుమారి , వేదికపై జాయింట్ కలెక్టర్

200 రోజుల ప్రణాళిక లక్ష్యాలు సిద్ధం చేయండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో 200 రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలు సిద్ధం చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. ప్రణాళికలో పేర్కొన్న లక్ష్యాల సాధనపై దసరా పండగ తర్వాత ప్రతివారం తాను సమీక్షిస్తానని చెప్పారు. నివేదికలో పొందుపరిచిన విధంగా పురోగతి ఉండాలని స్పష్టం చేశారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌తో కలిసి ఆమె జిల్లా, మండల అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. శ్మశాన వాటికలకు స్థలాల కేటాయింపుపై ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏపీ సేవా సర్వీసుల కింద 1753 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లా అధికారులు వాటిపై ఎందుకు దృష్టి సారించలేదని ప్రశ్నించారు. ఈనెల 14 నుంచి 21వ తేదీలోగా రహదారులు, మురుగు కాలువలు తదితర నిర్మాణాలకు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర- 2047 దార్శనిక పత్రం రూపకల్పనపై రైతులు, విద్యార్థులు, స్వయం సహాయ సంఘాలు, అన్నివర్గాల ప్రజల నుంచి క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా అభిప్రాయాలు సేకరించాలన్నారు. డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చామంతి పూసే లాభాలు కురిసె

వరుస పండగల నేపథ్యంలో చామంతి పూల సాగు చేసిన రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రస్తుతం కిలో రూ.110 నుంచి రూ.150 లకు ధర పలుకుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, బేతంచెర్ల

శేష వాహనంపై ఆదిదంపతులు





కొలువుదీరిన స్వామి, అమ్మవారు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల సందడి మిన్నంటుతోంది. ఉత్సవాల్లో ఐదోరోజైన సోమవారం భ్రమరాంబాదేవి స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్కందమాత తన పుత్రుడు కుమారస్వామిని ఒడిలో కూర్చోబెట్టుకొని వేదికపై కొలువుదీరారు. అర్చకులు అమ్మవారికి సమంత్రకంగా అర్చనలు చేశారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో పుష్పాలంకృతమైన శేషవాహనంపై ఆదిదంపతులు ఆశీనులయ్యారు. ఉభయ దేవాలయాల అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పుష్పార్చనలు చేసి మంగళ హారతులు సమర్పించారు. తర్వాత ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకొచ్చారు. ఊరేగింపులో ఎదుట కళాకారులు ప్రదర్శించిన కేరళ, కన్నడ సంప్రదాయ నృత్యాలు, మహిళల కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.





థయ్యం నృత్య ప్రదర్శన

శ్రీశైలంలో నేడు..

శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల ఆరోరోజు మంగళవారం భ్రమరాంబాదేవి కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు హంస వాహన సేవ జరగనుంది. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

వాగులో అడ్డుకట్టలు

■ బఫర్‌జోన్‌లో నిర్మాణాలు ■ గుర్తించినా చర్యలు శూన్యం

ఈనాడు, నంద్యాల

కర్నూలు నగర శివారులోని పి.రుద్రవరం గ్రామ పరిధిలో సర్వే నంబర్లు 215, 702/3, 214, 216లో ఓ నిర్మాణ సంస్థ పెద్దఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడింది. ‘కడగమ్మ’ వాగులోకి నీటి ప్రవాహం నియంత్రించేలా నిర్మాణాలు చేపట్టింది. నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు.. రూ.50 కోట్ల విలువైన బఫర్‌జోన్ భూములను ఆక్రమించారు.. విలాసవంతమైన భవంతులు నిర్మించి అమ్మకానికి పెట్టారు. నిజమని నిర్ధారణ అయినా చర్యలు తీసుకోవడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. సదరు నిర్మాణ సంస్థకు గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన వైకాపా పెద్దల అండదండలు సమృద్ధిగా ఉండటం వల్లే చర్యలకు వెనుకాడుతున్నారని తెలుస్తోంది. ఆరెకరాల వరకు ఆక్రమణలకు గురై ఉంటుందని రైతులు ఆరోపిస్తున్నారు.



పరిశీలించి వదిలేశారు

ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆక్రమణలు గుర్తించేందుకు వివిధ శాఖల ఉన్నతాధికారులు గత నెల 3వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి, జలవనరుల శాఖ ఎస్ఈ, డీఈఈ, ఏఈలు, కర్నూలు ఆర్డీవో, కర్నూలు గ్రామీణ తహసీల్దారు, మండల సర్వేయర్, ఎంపీడీవోలు నిర్మాణ ప్రాంతాన్ని నిశితంగా తనిఖీ చేశారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులు, రైతులను పిలిపించి మాట్లాడారు. నిర్మాణ సంస్థ పాల్పడిన ఉల్లంఘనలను పలువురు రైతులు అధికారులకు ప్రత్యక్షంగా చూపారు. “ తాత్కాలిక అనుమతులు తీసుకుని కాజ్‌వే నిర్మించారు.. గడువు ముగిసినా తొలగించడం లేదు.. కాజ్‌వే నిర్మాణంతో పొలాలను వరదలు ముంచెత్తుతున్నాయని’’ రైతులు వాపోయారు. శ్మశానం మధ్యలో అడ్డగోలుగా కచ్చా రోడ్డును వేశారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కుడా ఏం చేస్తున్నట్లు

జల వనరుల సమీపంలో వేసే లేఅవుట్లకు ‘కుడా’ అనుమతులు రావాలంటే జలవనరుల శాఖ నిరభ్యంతర పత్రం ఇవ్వాలి. సదరు వెంచర్‌కు తాము ఎన్‌వోసీ ఇవ్వలేదని జలవనరుల శాఖ అధికారులు తేల్చి చెబుతున్నారు. ‘కడగమ్మ వాగు’కు అనుకునే నిర్మాణ సంస్థ ప్రహరీ స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ప్రాంతం వాగు బఫర్‌జోన్ పరిధిలోనే ఉంటుందని రైతులు చెబుతున్నా కుడా అధికారులు పట్టించుకోవడం లేదు. సదరు సంస్థ భారీగా ముడుపులు ముట్టజెప్పడం వల్లే అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆదేశాలు బేఖాతరు

కాజ్‌వేను వెంటనే తొలగించాలి.. వరద వస్తే పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.. తాత్కాలిక కాజ్‌వే నిర్మాణానికి గతంలో ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తున్నాం.. తక్షణమే తొలగించకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ అధికారులు నిర్మాణ సంస్థకు లిఖితపూర్వకంగా ఆదేశాలిచ్చారు. ఉత్తర్వులు ఇచ్చి నెల రోజులు గడిచినా సదరు నిర్మాణ సంస్థ నుంచి స్పందనలేదు. అయినా అధికారులు అలసత్వంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థకు ఏమాత్రం సంబంధం లేని భూముల్లో పెద్దపెద్ద రేకులు ఏర్పాటుచేసి వాటిపై ప్రచార హోర్డింగులు ఏర్పాటుచేసినా వాటినీ తొలగించలేదు.

విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తాం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విద్యారంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హామీ ఇచ్చారు. నంద్యాల పట్టణంలోని మంత్రి కార్యాలయంలో ఆర్‌జేయూపీ నాయకులు సోమవారం ఆయన్ను కలిసి సమస్యలు విన్నవించారు. వినతిపత్రం అందజేశారు. జీవో 117ను రద్దు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో విలీనమైన తరగతులను మళ్లీ ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతి కల్పించే విధానాన్ని పునరుద్ధరించాలని విన్నవించారు.



మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌జేయూపీ నాయకులు

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం: మంత్రి బీసీ

బనగానపల్లి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బనగానపల్లి వ్యవసాయ కార్యాలయం ఆవరణలో రైతులకు రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలతో చెప్పించుకునే స్థాయికి వెళ్లామని అన్నారు. నియోజకవర్గానికి 16,111 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు చేశామని, అవసరమైతే అధికారుల నివేదిక ప్రకారం తిరిగి విత్తనాలు మంజూరు చేయిస్తామని అన్నారు.



శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి



పూత రాలొద్దు.. కాయ కందిపోవద్దు | కాసుల క్యాబేజీ | తెగుళ్ల కలవరింత

6లో

సహకార బ్యాంకులో రూ.78.77 లక్షలు స్వాహా

■ ఆత్మకూరులో అధికారుల కక్కుర్తి ■ ముగ్గురిపై కేసు నమోదు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఆత్మకూరు సహకార బ్యాంకులో జరిగిన రూ.80 లక్షల కుంభకోణంపై విచారణ పూర్తైంది. మొత్తం రూ.78,77,767 మేర నిధులు స్వాహా చేసినట్లు అధికారులు తేల్చారు. బ్యాంకు డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదైంది. బ్యాంకు డబ్బును తన సొంత అవసరాలకు, వ్యాపారం పేరుతో స్వాహా చేసిన ప్రధాన ముద్దాయి.. క్యాషియర్ ఎస్.అల్తాఫ్‌ను ఎ1గా, లాకర్‌లో డబ్బు మాయమవుతున్నా పట్టించుకోని పాసింగ్ ఆఫీసర్ వి.వెంకటరంగయ్యను ఎ2గా, పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంగా వ్యవహరించిన మేనేజర్ పులిరాజును ఎ3గా చేర్చారు. అధికారి, సిబ్బంది.. బ్యాంకు నమ్మకాన్ని వమ్ము చేశారని, ఫోర్జరీ, కుట్రపూరితంగా వ్యవహరించడం, మోసం.. తదితర పలు అభియోగాలతో 6(1)(2), 318 (4), 316 (5), 336 (3) 338, 344, 3(5) బీఎన్ఎస్, 66 (డి) సెక్షన్ల కింద ఆత్మకూరు అర్బన్ ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురిపై నమోదైన కేసు నమోదుకు సంబంధించిన సమగ్ర వివరాలను నంద్యాల జిల్లా కలెక్టర్‌కు బ్యాంకు సీఈవో నివేదించినట్లు సమాచారం.

ఎన్టీఆర్ గృహాలు ఎలా ఉన్నాయి

■ ఐదేళ్లూ చిల్లిగవ్వ ఇవ్వని వైకాపా ■ క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్న అధికారులు

డోన్, న్యూస్‌టుడే: బిల్లుల కోసం ఐదేళ్లుగా నిరీక్షిస్తున్న ఎన్టీఆర్ గృహ నిర్మాణదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకానికి పునాది వేశారు. పలువురు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొన్నారు.. అంతలోనే వైకాపా అధికారంలోకి వచ్చింది.. ఐదేళ్లుగా చిల్లిగవ్వ ఇవ్వలేదు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్టీఆర్ గృహాల పరిస్థితిపై సర్వే చేయాలని అధికారులను ఆదేశించింది. పథకం కింద ఎంత మంది ఇళ్లు నిర్మించుకొన్నారు.. అవి ఏ దశలో ఉన్నాయో ఆరా తీస్తున్నారు.



ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద చేపట్టిన ఇల్లు

- నంద్యాల జిల్లాలో 27191 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ఇందులో ఎన్ఎస్ (మొదలు కానివి) 4164, బీబీఎల్‌లో 1582, బీఎల్‌లో 3241, ఎల్ఎల్‌లో 39, ఆర్ఎల్‌లో 1079, ఆర్‌సీలో 9403 ఉండగా, 7683 ఇళ్లు పూర్తయ్యాయి.
- కర్నూలు జిల్లాలో 24628 ఇళ్లు ఉండగా, ఇందులో ఎన్ఎస్‌లో 4692, బీబీఎల్‌లో 1070, బీఎల్‌లో 3385, ఎల్ఎల్‌లో 35, ఆర్ఎల్ 1487, ఆర్‌సీ 8906, పూర్తయినవి 4999గా తేల్చారు.
- ఇళ్ల ప్రస్తుత పరిస్థితిని యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఎవరెవరికి ఎంతమేర బిల్లులు వచ్చాయి, ఎంతమేర రావాలి తదితర వివరాలన్నీ నమోదు చేస్తున్నారు.

పూత రాలొద్దు.. కాయ కందిపోవద్దు



ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో కంది సాధారణ సాగు విస్తీర్ణం 64 వేల ఎకరాలు.. ఈ ఏడాది 1.60 లక్షల ఎకరాల్లో సాగైంది. ప్రస్తుతం పంట పూతదశలో ఉంది.. ఈ దశలో తగిన చర్యలు తీసుకోవాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి సూచించారు. ఈ దశలో లేత పిందెలు, కాయల్లో పూత పురుగు, గూడు పురుగు గూడు చేసుకుంటాయి. కాయ అడుగు భాగాన రంధ్రం చేసి లోపలి గింజలను తినేసి డొల్ల చేస్తాయి. వీటి నివారణకు తొలిదశలో లీటరు నీటిలో పదివేల పీపీఎం వేపనూనెను 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతిని బట్టి క్లోరిపైరిఫాస్ 20 శాతం ఈసీ 2.5 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజియేట్ 0.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ. గానీ లీటరు నీటిలో కలిపి మార్చి మార్చి పిచికారీ చేయాలి.

కాయ ఈగ: పిల్ల పురుగులు కాయలో ఉండి గింజలను తినేస్తాయి. చివరకు తల్లి పురుగు బయటకు వస్తుంది. లేత పిందె దశలో గుడ్లు పెడుతుంది. వెంటనే గమనించి పది వేల పీపీఎం వేప గింజల కషాయం 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గింజ గట్టి పడే దశలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

శనగ పచ్చ: పూల మొగ్గలు, పూతను, కాయ లోపల గింజలను తిని నష్టపరుస్తుంది. పురుగు ఉధృతిని గమనించి ఎకరాకు ఆరు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పూత మొగ్గ దశలో పది వేల పీపీఎం వేప నూనె కషాయాన్ని 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉధృతిని బట్టి క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజియేట్ 0.2 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



కాసుల క్యాబేజీ



బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురానికి చెందిన ఇమామ్ కాశీం 1.30 ఎకరాల్లో క్యాబేజీ సాగు చేసి లాభాలు పొందుతున్నారు. ఒక్కోటి రూ.450 చొప్పున 14 ప్యాకెట్లు తీసుకొచ్చారు. నర్సరీలో 30 నుంచి 40 రోజుల వరకు నారు పెంచారు. తర్వాత ఎకరాకు 25 వేల మొక్కల చొప్పున 37 వేల వరకు నాటారు. 85-90 రోజుల్లో కోతకొచ్చింది. మొక్కలు నాటేందుకు 10 మంది కూలీలు అవసరం. మొక్క నాటేకంటే ముందు భూమిని బాగా కలియదున్ని సాళ్లలో గడ్డి మందు పిచికారీ చేయాలి. మొక్కలు నాటిన వారం రోజుల నుంచి పురుగు మందు వాడాలి. విత్తనాల కొనుగోలుకు రూ.7,200, భూమి దున్నేందుకు రూ.3 వేలు, నీళ్ల మందుకు రూ.12 వేలు, భూమిలో వేసే మందుకు రూ.12 వేలు, కలుపు తీసేందుకు కూలీలకు రూ.20 వేలు ఖర్చు చేశారు. మొత్తం 60 క్వింటాళ్ల (150 ప్యాకెట్లు) దిగుబడి వచ్చిందన్నారు. అన్ని ఖర్చులు రూ.54 వేలు పోనూ సుమారు రూ.85 వేల నుంచి రూ.90 వేలు వచ్చిందన్నారు.

- న్యూస్‌టుడే, బేతంచెర్ల

రైతేరాజు

వర్షాకాలం ముగిసింది.. చల్లని గాలుల తీవ్రత క్రమంగా పెరుగుతోంది.. ఈ నేపథ్యంలో అక్టోబరు, నవంబరు మాసాల్లో జీవాలకు పలు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.. యజమానులు నివారణ చర్యలు చేపడితే ఆరోగ్యంగా ఉంటాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం పశువిజ్ఞాన శాస్త్రవేత్త నిరంజన్‌రెడ్డి సూచించారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

తెగుళ్ల కలవరింత

☛ జాగ్రత్తలు తీసుకుంటేనే అధిక దిగుబడులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: వర్షాలు సమృద్ధిగా కురవడంతో కాల్వలు నిండుగా ప్రవహిస్తున్నాయి.. రెండేళ్ల తర్వాత వరి సాగు పెరిగింది.. ప్రస్తుతం పంట 60 రోజులకు చేరింది.. ప్రస్తుత దశలో తెగుళ్లు వచ్చే అవకాశం ఎక్కువ.. రైతులు అప్రమత్తంగా ఉంటేనే పంట దిగుబడి పెరుగుతుందని బనగానపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం. బాలరాజు సూచించారు.

■ **అగ్గితెగులు:** ముందు జాగ్రత్తగా సుడోమోనాస్ లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలి. ఉధృతిని బట్టి ట్రైసైక్లాజోల్ పొడి మందును 1 లీటరు నీటికి 0.6 గ్రాములు లేదా హెక్సాకొనజోల్ 1 లీటరు నీటికి 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. లేదా వెలిడా మైసిన్‌ను లీటరు నీటిలో 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

■ **కాండం పురుగు:** ఈ తెగులు సోకితే ఎకరాకు 8 కిలోల కార్బోఫ్యూరాన్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు చల్లాలి.

■ **సుడిదోమ:** ఈ తెగులు సోకితే లీటరు నీటిలో డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాముల పొడిని గానీ లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రాముల్ని గానీ లేదా పొనికామిడ్ 0.4 గ్రాముల్ని గానీ కలిపి పిచికారీ చేయాలి.

■ డ్రోన్‌తో పిచికారీ చేసే రైతులు ఆయా మందులను 80 శాతం మాత్రమే వినియోగించాలని, ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలి.

వ్యాధి ముదిరితే జీవం పోతుంది



■ **పీపీఆర్:** ఈ వ్యాధి సోకిన జీవాల్లో గొర్రెలకు జ్వరం తీవ్రత పెరుగుతుంది. గ్రాసం తినవు. నెమరు వేయదు. నోట్లో కురుపులు ఏర్పడి నోటి నుంచి దుర్వాసన వస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలు వ్యాధి తీవ్రతనుబట్టి వారం రోజుల వ్యవధిలో చనిపోతాయి.

■ **చిటెత్త:** ఈ వ్యాధికి సరైన చికిత్స లేదు. లక్షణాలు గమనించిన వెంటనే పశువైద్యున్ని సంప్రదించి మెలకువలు పాటిస్తే 50 శాతం వరకు జీవాలను కాపాడుకోవచ్చు. ఉప్పు, గ్లూకోజ్ కలిపిన గంజిని తాగిస్తే త్వరగా కోలుకుంటాయి. పొటాషియం పర్మాంగనేట్ 1 శాతం ద్రావణంతో నోట్లోని కురుపులను కడగాలి.

■ **నీలి నాలుక:** ఈ వ్యాధి వైరస్ వల్ల సోకుతుంది. దోమకాటుతో ఈ క్రిములు గొర్రెల శరీరంలోకి ప్రవేశించడంతో ప్రబలుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే గొర్రెల్లో నాలుక నీలిరంగుగా మారుతుంది. జ్వరమున్న గొర్రెల చిగుళ్లు, పెదవులు వాచి లోపలి భాగం ఎర్రగా మారి చిన్నగుల్లలు ఏర్పడుతాయి. నోటి నుంచి సొంగ, చొంగ కారుతుంది. గిట్టల మధ్య ఎర్రగా ఉంటుంది. వ్యాధి తీవ్రమైతే 5-6 రోజుల్లో మేత మేయక, నీరు తాగక చనిపోతాయి.

■ **చికిత్స:** నోట్లోని పుండ్లను 1 శాతం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి బోరిక్ పౌడర్ రుద్దాలి. గిట్టల మధ్యనున్న పుండ్లను కడిగి హిమాక్స్, సిమెంట్ వంటి ఆయింట్‌మెంట్లు పూయాలి. ఈ వ్యాధికి నిరోధక టీకాలు లేవు.

తూకం తప్పుతోంది

■ వినియోగదారులను దోచుకుంటున్న వ్యాపారులు ■ కొరవడిన అధికారుల తనిఖీలు



ఎలక్ట్రానిక్ కాటా

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ధరల భారంతో బెంబేలెత్తుతున్న వినియోగదారులను తూకాల్లో మోసాలతో కొందరు వ్యాపారులు దోచుకుంటున్నారు. తోపుడుబండ్ల నుంచి సూపర్ మార్కెట్ల వరకు తూనికల్లో మోసాలు నిత్య కృత్యమయ్యాయి. గతంలో త్రాసులతో మోసాలకు పాల్పడుతున్నారని.. ఎలక్ట్రానిక్ యంత్రాలైతే వీటిని అరికట్టవచ్చనే అభిప్రాయాలు ఉండేవి. ప్రస్తుతం వాటిల్లో కూడా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. వందల గ్రాముల సరకు తక్కువ వస్తుండటంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వీటిని అరికట్టాల్సిన తూనికలు కొలతల శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నంద్యాల జిల్లాలో ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు 4900 ఉన్నాయి. త్రాసులు 500 వరకు ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్ తూనిక యంత్రాలను అధికారులు ఏడాదికి ఒకసారి పరిశీలిస్తారు. తక్కెడ, తూనిక రాళ్లను రెండేళ్లకు ఒకసారి తనిఖీ చేస్తారు. వాటిలో తేడాలు సరిచేసి ముద్రలు వేస్తారు. వాటి ద్వారా మాత్రమే వ్యాపారులు తూకాలు వేయాల్సి ఉంది.

ఎలక్ట్రానిక్ కాటాల్లోనూ తేడాలు

ఎలక్ట్రానిక్ కాటాల్లో ముందుగానే వెయ్యి గ్రాములకు 100 గ్రాములు తగ్గించి సెట్ చేస్తారు. వినియోగదారులు కిలో సరకు తీసుకుంటే 900 గ్రాములు మాత్రమే వస్తుంది. ఇటీవల పాలను కూడా తూచి విక్రయిస్తున్నారు. వీరు అధికంగా మోసాలకు పాల్పడుతున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

రేషన్ బియ్యంలోనూ కోతే..

పౌర సరఫరాల శాఖ నుంచి వచ్చే రేషన్ బియ్యం బస్తాల్లో 49 కిలోలు ఉండాలి. 47 నుంచి 48 కిలోలు మాత్రమే వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు నంద్యాలలో పౌర సరఫరాల శాఖ గోదాముల్లో దాడులు చేసి 6 కేసులు నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

నంద్యాల జిల్లాలో తూనికలు, కొలతల అధికారులు రెండేళ్లలో నమోదు చేసిన కేసుల వివరాలు..

సం॥	ముద్ర రుసుం (రూ.)	అపరాధ రుసుం (రూ.)	తూకాల్లో మోసాలపై కేసులు	ప్యాకేజ్డ్ ఉత్పత్తులపై కేసులు
2023-24	15,00,000	12,93,400	67	232
2024	7,42,600	7,98400	28	157

(మార్చి నుంచి సెప్టెంబరు వరకు)


తూకాల్లో తేడాలుంటే ఫిర్యాదు చేయండి

- అనిత, ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతల శాఖ, నంద్యాల

సరకులు, వస్తువులను కిలోల్లో కొనుగోలు చేసినప్పుడు తూకాల్లో తేడాలు వస్తే మాకు ఫిర్యాదు చేయాలి. పాల తూకాల్లో తేడాలు ఉన్నాయని ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తాం.

రైతు ఆనందిస్తే అందరూ బాగుంటారు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : రైతు బాగుంటే అందరూ బాగుంటారని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల మార్కెట్ యార్డులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం ఆయన రైతులకు రాయితీ శనగలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర, పరికరాలపై ప్రతిపాదనలు తీసుకుంటానన్నారు. వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించి రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మార్కెట్‌యార్డులోని దుకాణాల లీజు సమయం ముగిసి రెండు నెలలు గడుస్తున్నా ఖాళీ చేయలేదన్నారు. అధికారులు వెంటనే వాటిని ఖాళీ చేయించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే కార్యాలయాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టరు తాతిరెడ్డి తులసిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, సహాయ సంచాలకులు రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



రైతుకు రాయితీ విత్తనాలు అందజేస్తున్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

శ్రీశైలం నీటిమట్టం 882.40 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.40 అడుగులు, నీటినిల్వ 201.1205 టీఎంసీలుగా నమోదైంది. ఎగువనున్న జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 77,393 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 62,767 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి లీలావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 35 ఏళ్లలోపు వయసున్న స్థానికులైన వివాహిత మహిళలు అర్హులన్నారు. అభ్యర్థులు వయసు, కుల, విద్యార్హత, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 10 నుంచి 21వ తేదీలోపు నంద్యాల సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు వింటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. నంద్యాల సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి 210 వినతులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పీజీఆర్‌ఎస్‌కు గైర్హాజరైన దివ్యాంగుల శాఖ ఏడీ, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్, గనులు, ఉప రవాణా, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులకు తాఖీదులు జారీ చేయాలని డీఆర్వో పద్మజను ఆదేశించారు. పోరంబోకు రస్తా స్థలాలకు డీపట్టాలు ఇచ్చిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు. నంద్యాలలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి ఆయన 86 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలకు త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు, ప్రతి సోమవారం దగ్గరలోని పోలీస్‌స్టేషన్, సర్కిల్, డీఎస్పీ కార్యాలయాల్లో జరిగే పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ యుగంధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


అహోబిలంలో నవరాత్రి ఉత్సవాలు



స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఉత్సవాల్లో భాగంగా అద్దాల మండపంలో ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవారిని తిరుమంజనం చేశారు. సాయంత్రం పల్లకిపై ఆశీనులైన స్వామి, అమ్మవారు ఊరేగింపుగా భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా ఉమామహేశ్వరుడి పల్లకి ఉత్సవం



పల్లకి ఉత్సవంలో భక్తులు

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వైభవంగా పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. పల్లకిలో ఉత్సవ విగ్రహాలను ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పల్లకితో ప్రాకార ఉత్సవం చేపట్టారు.

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ప్రభుత్వం వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి హరికృష్ణ డిమాండ్ చేశారు. జిల్లాలో గతంలో వాలంటీర్లుగా పనిచేసిన వారు సోమవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగా రాజీనామాలు చేసిన వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని, రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న వాలంటీర్లు

శ్రీశైలం ఈవోగా పెద్దిరాజు కొనసాగింపు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో)గా డి.పెద్దిరాజును కొనసాగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూశాఖ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న డి.పెద్దిరాజు ఏడాది డిప్యుటేషన్‌పై శ్రీశైలం ఈవోగా బాధ్యతలు చేపట్టారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన్నే ఈవోగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శ్రీశైలం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు ఈవో తెలిపారు.

టెట్‌కు 26 మంది గైర్హాజరు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 26 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో2 సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 160 మందికి 139, మధ్యాహ్నం 61కు 56 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్లు వివరించారు.

బాధితులకు పరిహారం పంపిణీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితుల్లో పరిహారం అందని వారికి నగదు పంపిణీ చేసినట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. పంటలు, గృహాలు, పశు సంపద నష్టపోయినా సాంకేతిక కారణాలతో ఖాతాల్లో పరిహారం జమ కాని పదిమందికి రూ.లక్ష నగదును సోమవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నష్ట పరిహారం అందని బాధితులకు సంబంధిత మొత్తాన్ని కలెక్టర్ ఖాతాలోకి జమ చేసి వారికి అందజేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 370 దరఖాస్తులు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలకు 370 దరఖాస్తులు వచ్చాయని ఆబ్కారీ శాఖ జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆబ్కారీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకునే విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆళ్లగడ్డ ఆబ్కారీ స్టేషన్ పరిధిలో 19 దుకాణాలకు 64 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, ఎస్సైలు సరస్వతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురపాలక సంఘము, నంద్యాల

ఆర్.ఒ.సి.నెం.315/2015/ఎ1 తేదీ: 05.10.2024

వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2024-25 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి నంద్యాల పురపాలక సంఘము ఆధీనం నందు గల డైలీ కూరగాయల మార్కెట్ గేట్స్ తేది: 17-10-2024న ఉదయం: 11.00 గం॥లకు పురపాలక సంఘ కార్యాలయం నందు బహిరంగ వేలం పాటలు నిర్వహించడునని తెలియజేయడమైనది.

సదరు వేలం పాటల యందు పాల్గొనదలచినవారు వివరముల కొరకు కార్యాలయం పనిచేయు వేళల యందు రెవెన్యూ విభాగము నందు ఎ1 గుమాస్తా గారిని సంప్రదించవలసినదిగాను మరియు పాటకు 3 రోజుల ముందుగా సాల్వెన్సీ సర్టిఫికేట్లు మరియు ఇతరములను కార్యాలయం నందు దాఖలు పరచవలసినదిగా కోరడమైనది.

సం/- కమిషనరు, నంద్యాల పురపాలక సంఘము.

ఆటోను ఢీకొన్న బైక్

☛ మహిళ మృతి, ముగ్గురికి గాయాలు

దొర్నిపాడు, న్యూస్‌టుడే: దొర్నిపాడు మండలం డబ్ల్యూ.గోవిందిన్నె శివారున ఆటోను ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందగా, ముగ్గురికి గాయాలయ్యాయని సోమవారం పోలీసులు తెలిపారు. కోవెలకుంట్ల మండలం భీమునిపాడుకు చెందిన షేక్ వుసేని బీ(44) ఆటోలో దొర్నిపాడు మండలంలోని ఓ గ్రామంలో పొలం పనికి వెళ్తోంది. ఉదయం 9 గంటల సమయంలో ఆటో క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకోగానే అదే సమయంలో ఎదురుగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆటోలో వుసేనిబీతో కూర్చున్న ముగ్గురు గాయపడ్డారు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి 108 సాయంతో తీసుకెళ్లారు. మెరుగైన చికిత్సకు నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందగా, ఇంకా ముగ్గురు చికిత్స పొందుతున్నారు.

కుటుంబానికి అండగా ఉంటూ...

వుసేని బీ కూలిపనులకెళ్తూ పక్షవాతంతో బాధపడుతున్న భర్తను, కుమారుడ్ని పోషిస్తోంది. కొన్నిరోజులుగా నంద్యాలలో ఉంటున్న ఆమె పనుల నిమిత్తం భీమినిపాడుకు వచ్చారు. భార్య మృతి చెందిన విషయం తెలిసినా మంచం మీద నుంచి లేవలేని భర్త పరిస్థితిని చూసి పలువురు కంటతడిపెట్టారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో డి.పీర్ షా(42) మృతి చెందారు. సోమవారం ఆయన ద్విచక్ర వాహనంపై వస్తుండగా పక్క సందులోంచి వస్తున్న టిప్పరును తప్పించేందుకు ప్రయత్నించి అదుపు తప్పి కింద పడ్డారు. ఆయనను టిప్పర్ వెనుక చక్రాలు బలంగా తాకడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చిరంజీవి తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

యనకండ్ల(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని బనగానపల్లి పోలీసులు తెలిపారు. యనకండ్లకు చెందిన దస్తగిరమ్మ (35) జీవితంపై విరక్తితో పురుగుమందు తాగారు. గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను బనగానపల్లి వైద్యశాలకు తరలించగా మృతి చెందారు. ఆమెకు భర్త కాశీం ఉన్నారు. బనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు రూ.1.10 లక్షల విరాళం


మంత్రి ఫరూక్‌కు చెక్కు అందజేస్తున్న న్యూక్లియస్ కళాశాల యాజమాన్యం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం నంద్యాల న్యూక్లియస్ జూనియర్ కళాశాల యాజమాన్యం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.1.10 లక్షల విరాళం అందజేసింది. కళాశాల కరస్పాండెంట్ మురళీధర్‌రెడ్డి, సంచాలకులు ఎన్‌వీ వాసుదేవరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది సోమవారం రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఆయన కార్యాలయంలో కలిసి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

'పల్లె పండుగ'కు హాజరవ్వండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల డ్వామా పీడీ ఎం.జనార్దన్‌రావు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక మంత్రి కార్యాలయంలో సోమవారం ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : **సమస్య :** నూనెపల్లెలో ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదు. **- ఫక్కీరయ్య**

సమస్య : సాయిబాబానగర్ ప్రాంతంలో కాల్వలు సరిగా శుభ్రం చేయడం లేదు. **- ఈశ్వర్, స్థానికుడు**

సమాధానం : సిబ్బందికి సూచించి రోజూ చెత్త తీసుకెళ్లేలా చూస్తాం. కాల్వలు శుభ్రం చేయిస్తాం.
- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

శ్రీశైలం, సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ నంద్యాల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సూచించారు. శ్రీశైల మహాక్షేత్రంలోని తపాలా కార్యాలయంలో సోమవారం ఆయన తపాలా వారోత్సవాలను ప్రారంభించారు. తపాలా సేవలు వినియోగించుకునే వారిని త్వరలో సత్కరించనున్నట్లు తెలిపారు. తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు తపాలా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నంద్యాల తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. నంద్యాల పట్టణంలోని డివిజనల్ తపాలా కార్యాలయంలో డీఎన్‌కే(డాక్ నిర్యాత్ కేంద్ర), బీఎన్‌పీఎల్(బుక్ నౌ పే లేటర్) ఖాతాదారులతోసోమవారం సమావేశం నిర్వహించారు.

బోయరేవుల (వెలుగోడు): తపాలా సేవలను గ్రామీణులు సద్వినయోగం చేసుకోవాలని నందికొట్కూరు తపాలా ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర సూచించారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా సోమవారం వెలుగోడు మండలం బోయరేవుల గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు హారిక ఎంపిక

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని పద్మావతి పాఠశాల విద్యార్థిని హారిక ఖోఖో సౌత్‌జోన్ ఇండియా లీగ్ మ్యాచ్‌కు ఎంపికైనట్లు పాఠశాల ఎండీ ఆశ తెలిపారు. ఈనెల 5న ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో హారిక ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె వెల్లడించారు. ఈనెల 16, 17 తేదీల్లో కోయంబత్తూరులో జరగబోయే జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ఈ విద్యార్థిని పాల్గొననున్నట్లు వివరించారు.

ఊరిస్తారు.. ఖాతాలు ఊడ్చేస్తారు

◆ రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలు
◆ ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు


సైబర్ నేరాలు అరికట్టాలని ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : రోజుకో విధంగా సైబర్ నేరగాళ్లు ప్రజలను వంచిస్తున్నారు. ఫోన్లు చేసి మాటలతో మభ్యపెట్టి ఖాతాల్లోని నగదును ఖాళీ చేస్తున్నారు. పండగలు వస్తున్నాయంటే చాలు.. మీకు ఆఫర్ ఉందని.. బహుమతి వచ్చిందని.. లాటరీ తగిలిందని ఫోన్లు చేస్తారు.. మీరు మా కంపెనీ బహుమతికి అర్హత సాధించారు.. అది కావాలంటే ముందుగా కొంత సొమ్ము మాకు పంపండి అంటారు. ఫోన్‌లో ఈ లింక్ నొక్కితే అద్భుతం చూస్తారు.. అంటూ మోసపూరిత లింక్‌లను మీ ఫోన్‌కు పంపుతారు. మీ పేరు నేరగాళ్ల జాబితాలో ఉంది తొలగించాలంటే మేము చెప్పినంత డబ్బు ఇవ్వండి అంటూ.. వివిధ మార్గాల్లో సైబర్ నేరగాళ్లు ప్రజలకు బోల్తా కొట్టిస్తున్నారు. వీరి వలలో పడి భారీగా మోసపోయిన కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

◆ నంద్యాల జిల్లాలో రోజుకు ఒక కొత్తరకం సైబర్ నేరాలు బయటపడుతున్నాయి. జిల్లాలో సైబర్ నేరాలపై నెలకు 180 నుంచి 200 వరకు కేసులు నమోదవుతున్నాయి. ప్రతిరోజూ ఆరేడుగురు సైబర్ మోసగాళ్ల బారిన పడుతున్నారు. వీటిపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా సరే ప్రజలు మోసపోతూనే ఉన్నారు.

అనేక మార్గాల్లో దోపిడీ

◆ నంద్యాల పట్టణం సలీంనగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి చరవాణికి ఓ కంపెనీలో పెట్టుబడి పెడితే రెట్టింపు సొమ్ము వస్తుందన్న సందేశం వచ్చింది. దాన్ని నమ్మిన ఆయన ఆ మెసేజ్‌లో వారిచ్చిన లింక్‌పై నొక్కి అడిగిన సమాచారాన్ని నమోదు చేసి ఖాతా నుంచి రూ.7.5 లక్షల వరకు బదిలీ చేశారు. చివరకు మోసపోయానని తెలుసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.

◆ శిరివెళ్ల మండలానికి చెందిన ఓ వ్యక్తి లోన్‌యాప్ ద్వారా రుణం తీసుకున్నారు. ఆ డబ్బు తిరిగి చెల్లించినప్పటికీ ఇంకా చెల్లించాలని.. లేదంటే మీ కుటుంబ సభ్యుల ఫొటోలు మీ బంధువుల ఫోన్లకు పంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించారు.

◆ బండిఆత్మకూరు మండలం జి.లింగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాట్సప్ నుంచి ఓ బ్యాంకుకు సంబంధించిన లింక్ ఇతర వాట్సప్ గ్రూపులకు వెళ్లిపోయింది. ఆ విషయం ఆ వ్యక్తికి కూడా తెలియదు. కొంతమంది ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో వారి ఖాతాల నుంచి నగదు పోయింది. ఇలా తన ఖాతా నుంచి రూ.30 వేలు పోయిందని ఓ బాధితుడు బండిఆత్మకూరు పోలీసులను సంప్రదించారు. ఆ లింక్ పంపిన వ్యక్తిని స్టేషన్‌కు పిలిస్తే తన చరవాణి హ్యాక్ అయ్యిందని, తనకు తెలియకుండానే వాట్సప్‌లో మెసేజ్ షేర్ అయ్యిందని వాపోయారు.

వెంటనే 1930కి కాల్ చేయాలి

సైబర్ మోసానికి గురైన వారు.. బ్యాంకు నుంచి మోసగాళ్లు డబ్బు తీసేసుకునే లోపే 1930 నంబరుకు కాల్ చేయాలి. లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి. మోసం జరిగిందని గుర్తించిన వెంటనే అప్రమత్తమై ఫిర్యాదు చేస్తే బ్యాంకు ఖాతాలో నగదు మాయం కాకుండా చూసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అదిరాజ్‌సింగ్‌రాణా, ఎస్పీ, నంద్యాల

పండగలను దృష్టిలో పెట్టుకొని ఫ్రీ గిఫ్ట్‌ల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆఫర్లు అంటే ఆశపడి చరవాణికి వచ్చే లింక్‌లను క్లిక్ చేసి మోసపోవద్దు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930కి కాల్‌చేయాలి.

అడివేశ్వర ఆలయాభివృద్ధికి రూ.4 లక్షల విరాళం


నగదు అందజేస్తున్న దాత

రాజోలి, న్యూస్‌టుడే : జోగులాంబ గద్వాల జిల్లా రాజోలిలోని అడివేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు దొండపాటి రాజులు రూ.4 లక్షల విరాళం అందజేశారు. సోమవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందించారు.

మహానంది దేవస్థానానికి రూ.లక్ష అందజేత


దాతకు ప్రసాదాలు అందజేస్తున్న ఏఈవో మధు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రాభివృద్ధి కోసం నంద్యాల పట్టణంలోని రావూస్ కళాశాలల అధినేత అప్పారావు రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం ఆయన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఏఈవో మధుకు విరాళం అందజేశారు.

అన్నదానానికి రూ.50 వేల వితరణ

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి పారుమంచాల గ్రామానికి చెందిన మండడి సుధాకరరెడ్డి, శ్రీలక్ష్మమ్మ, శ్రీనివాసరెడ్డి, స్వప్నమ్మ సోమవారం రూ.50 వేల విరాళం అందజేశారు.

చెంచుల అభివృద్ధికి కృషి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని నాగలూటిగూడెంలో సోమవారం చెంచులకు గుడిసెలపై కప్పే టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందనీ, ఈనెల 14 నుంచి 21వ తేదీలోపు పనులు చేపడతామని చెప్పారు. అనంతరం చెంచుగూడెంలో మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సురేష్‌కుమార్, మేనేజరు కె.జి.నాయక్, తెదేపా నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వంగాల శివరామిరెడ్డి, కొండలరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.


టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

కుష్ఠు రోగులకు వైద్యం అందించండి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : శరీరంపై స్పర్శలేని మచ్చలు, పొడలు, ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా ఉండటం వంటి లక్షణాలున్న కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించి సర్వజన ఆసుపత్రిలో చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంసీహెచ్‌లో కుష్ఠు, క్షయ వ్యాధులపై సోమవారం పీహెచ్‌సీ మెడికల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. కుష్ఠు బాధితులకు ఖరీదైన మందులు, శస్త్రచికిత్సలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్ఠు నియంత్రణాధికారి డా.శారదాబాయి, వైద్యాధికారి డా.కాంతారావు, వైద్యులు పాల్గొన్నారు.







నంద్యాల గాంధీచౌక్ : నిమిషాంబ ఆలయంలో మహాలక్ష్మి అలంకారంలో నిమిషాంబదేవి

నంద్యాల గాంధీచౌక్ : బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

నంద్యాల గాంధీచౌక్ : మెయిన్ బజార్‌లోని వాసవీ మాత ఆలయంలో అర్ధనారీశ్వరిగా అమ్మవారు


నందికొట్కూరు : కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహాచండీ అలంకరణ

శ్రీశైలం : దానయ్యస్వామి వీరశైవ గురుకులంలో అమ్మవారికి విశేష పూజలు

స్కందమాత.. ముక్తి ప్రదాత

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదోరోజు సోమవారం శ్రీశైలం, మహానంది క్షేత్రాల్లో అమ్మవార్లకు స్కందమాత అలంకరణ చేశారు. మిగతా ఆలయాల్లో అన్నపూర్ణాదేవి, మహాచండీ, అర్ధనారీశ్వరి, కామాక్షీదేవి, లలితాపరమేశ్వరీదేవి తదితర రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం**


మహానంది : గజవాహనంపై స్కందమాత గ్రామోత్సవం


నంద్యాల గాంధీచౌక్ : సంజీవనగర్ కోదండ రామాలయంలో అన్నపూర్ణాదేవిగా..


నంద్యాల గాంధీచౌక్ : జగజ్జనని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


నంద్యాల గాంధీచౌక్ : వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పల్లె కబుర్లు

పాములపాడు, న్యూస్‌టుడే : తడిసిన మొక్కజొన్న దిగుబడులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వేంపెంట గ్రామ రైతులు లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు తహసీల్దారు కార్యలయంలో డీటీ పఠాన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : జూపాడుబంగ్లా మద్యం దుకాణానికి ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు సూచించారు. ఈనెల 9లోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని దుద్యాల గ్రామ సచివాలయంలో సోమవారం నాగుపాము కలకలం రేపింది. దాన్ని చూసిన సిబ్బంది కేకలు వేయడంతో స్థానికులు వచ్చి దానిని బయటికి పంపేశారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని విద్యుత్తు ఉపకేంద్రం సబ్ ఇంజినీరుగా ప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు.

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని దుర్గాభోగేశ్వర ఆలయంలో కార్తికమాసంలో దుకాణాల ఏర్పాటుకు సోమవారం వేలం పాట నిర్వహించినట్లు ఈవో రామనుజన్ తెలిపారు. టెంకాయల దుకాణాన్ని రూ.2.12 లక్షలు, మిఠాయిల దుకాణాన్ని రూ.31 వేలకు వ్యాపారులు దక్కించుకున్నట్లు చెప్పారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రం పాణ్యంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అమ్మవారు సోమవారం లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గడివేముల, న్యూస్‌టుడే : గడివేములలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేక అర్చనలు చేశారు. ఆర్యవైశ్యులు కుంకుమార్చనలు నిర్వహించారు.

కొత్తపల్లి, న్యూస్‌టుడే : కృష్ణానదిలో సోమవారం తెలంగాణ పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన బోటులో భక్తులు సంగమేశ్వరం గర్భాలయ సమీపంలో విహరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇక్కడ పర్యాటకుల కోసం బోటింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మిడుతూరు, న్యూస్‌టుడే : మండలంలోని వీపనగండ్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న మహేశ్ (43) గుండెపోటుతో మృతి చెందినట్లు సమాచారం. సోమవారం రాత్రి అస్వస్థతకు గురైన ఆయన్ను కర్నూలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని జీసీపాలెం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జగన్‌మోహన్ సోమవారం తెలిపారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : జిల్లాలో భారీ వర్షాల కారణంగా మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. నంద్యాలలో సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులకు సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులకు మధ్య తోపులాట జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో ధర్నా చేసిన అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ.3300 గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. దళారి వ్యవస్థను అరికట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ధర్నాలో నాయకులు బాబాఫకృద్దీన్, బాలకృష్ణ, హరినాథ్, రమేష్‌బాబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు

పంట నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్ జి.రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాములపాడు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి, మిడుతూరు, పగిడ్యాల, నందికొట్కూరు మండలాల రైతులు నష్టపోయారన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలన్నారు. ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు.

పాలకొమ్మ చెట్టు స్థలాన్ని కాపాడండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పురపాలక సంఘానికి చెందిన పాలకొమ్మ చెట్టు స్థలాన్ని కాపాడాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు రవికుమార్ డిమాండ్ చేశారు. నాగులకుంట రోడ్డులోని ఈ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేశాడని ఆరోపించారు. పాలకొమ్మ చెట్టు స్థలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. గతంలో ఇక్కడి చెట్టును నరికేసిన కబ్జాదారుడు మున్సిపల్ అధికారుల అండతో ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని చెప్పారు. మాదిగల జీవనోపాధిగా ఉన్న ఈ స్థలాన్ని నాయకులు కబ్జా చేయడం అన్యాయమన్నారు.

డీఎల్‌డీవోగా శివారెడ్డి


డీఎల్‌డీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : నంద్యాల డీఎల్‌డీవోగా శివారెడ్డి సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ డీఎల్‌డీవోగా పనిచేస్తున్న మురళీకల్యాణి అనంతపురం జిల్లా ధర్మవరానికి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న శివారెడ్డిని నంద్యాలకు బదిలీ చేశారు. విధుల్లో చేరిన ఆయన్ను ఎంపీడీవో సుగుణశ్రీ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : భాజపా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మోమిన్ షబానా పేర్కొన్నారు. మండలంలోని నాగలూటి చెంచుగూడెం, బైర్లూటి చెంచు గూడెం, ముర్తుజావలి దర్గా వద్ద సోమవారం ఆమె పార్టీ సభ్యత్వం గురించి వివరించి సభ్యత్వ నమోదు చేయించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలతో పేదలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు రెండోరోజు సోమవారం హోరాహోరీగా జరిగాయి. రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. బాలుర విభాగంలో ఒడిశాపై హిమాచల్‌ప్రదేశ్ జట్టు 4- 3 తేడాతో విజయం సాధించింది. బాలికల విభాగంలో ఐటీసీ జట్టుపై దిల్లీ జట్టు విజయం సాధించినట్లు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి నాగేంద్ర తెలిపారు.


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న రామకృష్ణారెడ్డి

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం మండలంలో రెండు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అబ్కారీ శాఖ సీఐ ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. సున్నిపెంటలోని రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్కరు ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వీధిదీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో రాత్రి సమయాల్లో చాలా ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలు వెలగడంలేదు. పట్టణంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధులు చీకటి మయంగా మారి రాత్రి సమయాల్లో ప్రజలు బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. దీనిపై గత నెల 30న ఈనాడులో 'గాలిలో దీపాలు..పురాల్లో చీకట్లు' అనే చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన పురపాలక అధికారులు సోమవారం పట్టణంలో వెలగని విద్యుత్తు దీపాలకు మరమ్మత్తులు చేశారు. వెలగని వాటి స్థానంలో నూతన దీపాలు ఏర్పాటు చేశారు. వీధి దీపాలకు మరమ్మత్తులు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పల్లె ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం

☛ దారుణంగా దెబ్బతిన్న గ్రామీణ రహదారులు



కొత్తపల్లి మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలో రహదారి మొత్తం భారీ గుంతల ఏర్పడ్డాయి. గుంతల్లో వర్షంనీరు నిలిచి ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. పది గ్రామాల ప్రజలు కొత్తపల్లి, ఆత్మకూరుకు రాకపోకలు సాగించేందుకు ఈ రోడ్డు దిక్కు.



పాములపాడు మండల కేంద్రం నుంచి కొత్తపల్లి మండలంలోని ఎం.లింగాపురానికి వెళ్లే దారి మొత్తం కంకర తేలింది. జాతీయ రహదారి నిర్మాణానికి మట్టి, ఇతర సామగ్రి తీసుకెళ్లే భారీ వాహనాలు తిరగడంతో చెలిమిల్ల, పాములపాడు మధ్య రోడ్డంతా దెబ్బతింది. కంకర తేలి గుంతలమయంగా మారింది. కొత్త మాడుగుల సమీపంలో మలుపు వద్ద తారు కుంగిపోయి గుంత ఏర్పడింది. ఈ రహదారిపై పాములపాడు మండలంలోని లింగాల, చెలిమిల్ల, ఇస్కాల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని ఎం.లింగాపురానికి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి.

☛ పాములపాడు మండలం మిట్టకందాల గ్రామంలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీనిపై నిత్యం మురుగునీరు పారుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో వాడాల, మద్దూరు గ్రామాల ప్రజలు పాములపాడు, ఆత్మకూరుకు రాకపోకలు సాగిస్తుంటారు.

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : నందికొట్కూరు నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఏళ్ల తరబడి నిర్వహణ లేక దారుణంగా దెబ్బతిన్నాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయించకపోవడంతో.. అడుగడుగునా గుంతలు ఏర్పడి.. కంకర తేలి ప్రయాణానికి అనువుగాకుండా మారాయి. వీటిపై ప్రయాణిస్తూ గ్రామీణులు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జూపాడుబంగ్లా మండలంలోని 80 బన్నూరు నుంచి పోతులపాడు, చాబోలు గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పోతిరెడ్డిపాడు విస్తరణ పనుల్లో భాగంగా భారీ వాహనాలు తిరగడంతో బీటీ రోడ్డు దెబ్బతిని మట్టిరోడ్డులా మారింది. ఏళ్లు గడుస్తున్నా దీనికి మరమ్మతులు చేయించలేదు. దీంతో ఈ దారిలో ప్రయాణం సాగించేందుకు రెండు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.



ఆళ్లగడ్డ
● ఆళ్లగడ్డ ● బనగానపల్లి ● డోన్

దరఖాస్తులు ఆహ్వానం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఏపీలో నూతన మద్యం విధానం గొప్పగా ఉందని నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం కోవెలకుంట్ల ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. ఒక వ్యక్తి ఎక్కడి నుంచైనా ఎన్ని దుకాణాలకైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారన్నారు

ఉయ్యాలవాడ: మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 24 దరఖాస్తులు స్వీకరించినట్లు కోవెలకుంట్ల ఎక్సైజ్ శాఖ సీఐ పక్రీ బాషా తెలిపారు.

దొర్నిపాడు: నూతన మద్యం పాలసీ కోసం ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ బాషా తెలిపారు. దొర్నిపాడు మండలానికి ఒక్కటే మద్యం షాపునకు అనుమతి ఉందన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని 19మద్యం దుకాణాలకు ఏప్రాంతానికి చెందిన వారైనా సరే దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ క్రిష్ణమూర్తి తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బేతంచెర్ల,న్యూస్‌టుడే: డోన్, బనగానపల్లె, కర్నూలు రహదారిలోని పాలిష్ పరిశ్రమలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ మధుసూదన్‌రెడ్డి, ఏఈ పుల్లయ్య తెలిపారు. అయ్యలచెరువు, సంజీవనగర్, డోన్ రహదారిలోని విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని పాలిష్ పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

ప్యాపిలి: సమస్య: మాధవరంలో కోవెలకు ఎదురుగా ఉన్న మినీ ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. -శ్రీకాంత్

జవాబు: శుభ్రం చేయిస్తాం. **-లక్ష్మీనారాయణ, సర్పంచి**

సమస్య: యర్రగుంట్ల బస్టాప్ వద్ద ముళ్లపొదలను తొలగించాలి. **-సుభద్ర.**

సమాధానం: తొలగించి శుభ్రం చేయిస్తాం.
-అలీ, సర్పంచి, యర్రగుంట్ల.

సమస్య: శిరివెళ్ల ప్రధాన రహదారిపై వర్షపునీరు నిల్వ ఉంది. **-నాగయ్య.**

జవాబు: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **-సాలమ్మ, సర్పంచి, శిరివెళ్ల**

నిధులు విదల్చక... అవస్థలు తీర్చక

☛ పురపాలికలో వ్యర్థాల తొలగింపు ప్రహసనమే

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘాల పరిధిలోని వార్డుల్లో చెత్త నిర్వహణ అంతంతమాత్రమే. తడి, పొడి చెత్త వేరు ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. వార్డుల్లోని ఏ వీధులు చూసినా చెత్తపోగులతో దర్శనమిస్తున్నాయి. రహదారుల వెంట వెళ్లే జనం ముక్కు మూసుకొని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. సిబ్బంది ఉన్నా.. వాహనాల కొరతతో చెత్తను తొలగించడం లేదు. తొట్టెల కొరత కూడా వేధిస్తోంది. పురపాలక పరిధిలో 32 వార్డులకు గాను 75 వేలకు పైగా జనాభా నివసిస్తోంది. 110 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. రెండు కాంపాక్టర్లు, మూడు ట్రాక్టర్లు, ఆరు మినీ ఆటోల్లో మాత్రమే చెత్తను తరలిస్తున్నారు. పురపాలిక పరిధిలో రోజూ తడి చెత్త 15 మెట్రిక్ టన్నులు, పొడి చెత్త 14 మెట్రిక్ టన్నులు కంపోస్టుయార్డుకు పారిశుద్ధ్య వాహనాల ద్వారా తరలిస్తున్నారు.

కొత్తవాటి ఊసేదీ...?

చెత్త సేకరణకు సంబంధించి 2018లో తెదేపా హయాంలో స్వచ్ఛాంధ్రమిషన్ కింద రూ.5 లక్షలతో 40 తోపుడుబళ్లు, 200 చెత్త తొట్టెలు అందించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నగరంలో చెత్త నిర్వహణను పట్టించుకోకపోవడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. ఒక్కో తోపుడు బండిలో నాలుగు ప్లాస్టిక్ బకెట్లు ఉంచి కార్మికులు ఇంటింటా చెత్త సేకరణ చేపడుతున్నారు. ప్రస్తుతం 23 తోపుడుబండ్లు ఉండగా, వాటిలో కొన్నింటికి చక్రాలు సరిగా లేక వాటిని వినియోగించడంలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులకు నోచుకోక తొట్టెలు అడుగుభాగాన రేకులు దెబ్బతినడం, కొన్నింటికి సైడ్ కొక్కేలు ఊడిపోవడంతో కాంపాక్టర్లకు ఎత్తుకునేందుకు సిబ్బంది అవస్థలు పడుతున్నారు. 2020-21లో రూ. 40వేలకు పైగా ఖర్చు చేసి 20 స్టీలు లిట్టర్ బిన్నులు ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన సిమెంటు కుండీలన్నీ పాడైనా...కొత్తవాటికి ఎవరూ ప్రయత్నించడం లేదు. కాల్వల్లో తీసిన వ్యర్థాలను తొలగించేందుకు మూడు నెలల కిందట పురపాలక అధికారులు సాధారణ నిధుల కింద దాదాపు రూ. లక్షతో పది తోపుడుబండ్లు (వీల్‌బ్యారోల్) తెప్పించారే తప్ప..పుష్‌కార్టులు గానీ, ప్లాస్టిక్ బిన్నులు, కాంపాక్టర్ బిన్స్ గానీ తెప్పించలేదు. వాటిపై జాడీల పరిశ్రమ ఆవరణంలో, పలు ప్రాంతాల్లో చెత్త రిక్షాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. వాటిని పట్టించుకునే వారే కరవయ్యారు. చెత్త పాలకులు, అధికారులు స్పందించడం లేదు.


నెహ్రూనగర్‌లోని ఓ వీధిలో కుండీ నుంచి తొలగించని చెత్త.. దీని పక్కనే వ్యర్థాలు

డంపింగ్‌యార్డులను తలపిస్తూ..

పురపాలక పరిధిలో చెత్త కుండీలు లేక ఆయా ప్రాంతాల్లోని ప్రజలు చెత్త ఎక్కడ వేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. 23 తోపుడుబళ్లు మాత్రమే పనిచేస్తుండగా...వాటితో పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటి చెత్తను సేకరిస్తూ ప్రధాన రహదారుల పక్కన ఉన్న తొట్టెల్లో వేస్తున్నారు. పురపాలిక ఇప్పటికైనా కొత్త తొట్టెలు కొనుగోలు చర్యలు చేపట్టాలని నివాసితులు కోరుతున్నారు.

వైభవంగా గ్రామోత్సవం

సంజామల, న్యూస్‌టుడే: దసరా నవరాత్రుల్లో భాగంగా పేరుసోమల విష్ణుకంఠి క్షేత్రంలోని కంబగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీ, సిద్ధలక్ష్మి


గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంబగిరి నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు ఆలయ నిర్వాహకులు రామ్మోహన్‌స్వామి ఆధ్వర్యంలో భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా తొట్టోత్సవం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆళ్లగడ్డలో తొట్టోత్సవం జరిపారు. అమ్మవారు ఉపాంగ లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.


తొట్టోత్సవంలో అర్చకులు

బండరాళ్లు ఉంటే ఎలా..?

కొత్తపేట కాలనీలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో రహదారి పక్కనే మురుగుకాల్వను నిర్మించారు. అందులో బండరాళ్లను ఎవరు వేశారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కాల్వలో వేసిన బండరాళ్లను తొలగించి మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, డోన్‌పట్టణం



కంకర తేలి..కష్టాలను మిగిల్చి

మాయలూరు-సుంకేసుల వెళ్లే మార్గంలో రైల్వే వంతెన వద్ద అధికారులు ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు పాడైంది. ఎస్సార్బీసీ 16వ బ్లాక్ ఉప కాల్వ నుంచి వృథాగా వస్తున్న నీటి ఉద్ధృతికి ఇసుక, సిమెంటు లేచి కంకర మిగిలింది. వంతెన వద్ద నీరు మూడు అడుగుల లోతులో నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

-న్యూస్‌టుడే, మాయలూరు(ఉయ్యాలవాడ)



ముక్కుమూసుకొని వెళ్లాల్సిందే!

పట్టణంలోని రంగరాజు పేటలో కస్బా పాఠశాల పక్క వీధిలో మురుగు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల కిందట ఇలాగే కాలువ నిండి మురుగంతా రోడ్డుపై పారుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపి కాలువలో మురుగు పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, బనగానపల్లి



శిరివెళ్ల..సమస్యలు నిలువెల్లా!

శిరివెళ్ల, న్యూస్‌టుడే: శిరివెళ్లలో ఏళ్లనాటి సమస్యలు పరిష్కారంకాకపోవడంతో జనాలు ఇబ్బందులుపాలవుతున్నారు. శిరివెళ్ల మేజర్ పంచాయతీలో 17 వార్డుల పరిధిలో 5,800 కుటుంబాలు ఉండగా, 20 వేల మంది జనాభా ఉన్నారు. 13 వేల మంది ఓటర్లు ఉండగా మజరా గ్రామాలుగా వెంకటేశ్వరపురం, కొట్టాలపల్లె గ్రామాలున్నాయి. ఏటా రోజువారీ, వారపుసంత, కబేళా రూపంలో పంచాయతీకి రూ. 18 లక్షలు, రిజిస్ట్రేషన్ రూపంలో రూ. 3 లక్షలు, కుళాయి, ఇంటి, గ్రంథాలయం తదితర పలు రకాల పన్నుల రూపంలో రూ.14 లక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ అభివృద్ధికి రూ. కోటికి పైగానే నిధులు విడుదలవుతున్నా... సమస్యలు పరిష్కారం కావడం లేదు.


పోలీస్‌స్టేషన్ కాలనీలో తొలగించని మురుగు


శిరివెళ్లలో వక్ఫ్‌బోర్డు స్థలంలో కొనసాగుతున్న వారపుసంత

తీర్చాల్సినవి ఇవీ...!

- పంచాయతీలోని ముబారక్‌పేట, బలిజపేట, ఆకుతోటపేట, రాముని మాన్యం కాలనీల్లో సీసీ రోడ్లు వేయాలని జనాలు ఏళ్లుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.
- ప్రధాన రహదారి, పోలీస్‌స్టేషన్, ఎస్సీ బీసీ కాలనీల్లో కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయకపోవడంతో మురికికూపాలుగా మారుతున్నాయి. వర్షం కురిస్తే మురుగంతా రోడ్లపైకి పారుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- 16 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ ఒక్కటి తప్ప మిగిలినవన్నీ అద్దె కేంద్రాల్లో నడుస్తున్నాయి.అసౌకర్యాలు వేధిస్తుండటంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.
- గ్రంథాలయానికి సొంతభవనం లేకపోగా, వారపు సంతను కూడా వక్ఫ్‌బోర్డ్ స్థలంలో నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని వ్యాపారులు వాపోతున్నారు.
- పారిశుద్ధ్య కార్మికులు 40 మంది అవసరం కాగా...కేవలం 21 మంది ఉండటంతో వీధుల్లో చెత్త తొలగక పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి.
- కొట్టాలపల్లె గ్రామానికి శిరివెళ్ల నుంచి రహదారి సౌకర్యం కల్పించాలని, తాగు రక్షిత గ్రామాలలో ఇంటింటికి తాగునీటి కుళాయి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నా..ఎవరూ పట్టించుకోవడం లేదని నివాసితులు వాపోతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి -అశ్విన్ కుమార్, ఈవో

మేజర్ పంచాయతీ కావడం, మజరా గ్రామాలు సంఖ్య ఎక్కువగా ఉండటంతో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. గ్రామ పంచాయతీలో ప్రధానంగా కాలువల సమస్య వేధిస్తోంది. చిన్నపాటి వర్షానికే నిరంతరం రోడ్లపైన, కాలనీల్లో నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించాం. ఈవోగా రెండు రోజుల కిందటే బాధ్యతలు చేపట్టాను. మేజర్ పంచాయతీపై అవగాహన పెంచుకుని ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

వరద బాధితులకు రూ.1,17,500 చెక్కు అందజేత

బనగానపల్లె, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు బనగానపల్లె ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తరఫున రూ.1,17,500 చెక్కును మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. బనగానపల్లె


మంత్రి బీసీకి చెక్కును అందజేస్తున్న కరస్పాండెంట్లు

తెదేపా కార్యాలయంలో మంత్రిని కలిసిన కరస్పాండెంట్లు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ వరద బాధితుల కోసం సాయం చేయడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరు బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి వెల్లడించారు. కరస్పాండెంట్లు రామసుబ్బారెడ్డి, కొదారు కమలేశ్వర్‌రెడ్డి, పాతపాడు కొండారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, కొండారెడ్డి, కొదారు రవితేజారెడ్డి పాల్గొన్నారు.

అండగా ఉంటాం: బీసీ

సంజామల, న్యూస్‌టుడే: సంజామల గ్రామ తెదేపా నాయకుడు కె.పెద్దపుల్లయ్య గుండెపోటుతో చనిపోయారని తెలుసుకున్న రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ సోమవారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమారుడు శ్రీకాంత్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పుల్లయ్య కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తెదేపా మండల నాయకులు బత్తుల ప్రతాప్‌రెడ్డి, తోకల మద్దిలేటి, మల్లి హుసేని, మాధవ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు సంపూర్ణ సహకారం

బనగానపల్లి, న్యూస్‌టుడే: క్రీడాభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ యార్డు ఆవరణలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న రాజారెడ్డి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బనగానపల్లె గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయవాది తులసీశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పొదుపు భవనంలో మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సును ఆమె నిర్వహించి మాట్లాడారు. సీడీపీవో ఉమామహేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

బలిజలు హక్కులు సాధించుకోవాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: బలిజలు ఐకమత్యంతో ముందుకు సాగి హక్కుల్ని సాధించుకోవాలని బలిజ సంఘం నాయకుడు డా.ఎంవీ


కార్యాలయ ప్రారంభోత్సవంలో బలిజ నాయకులు

ప్రసాదు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో బలిజ సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజకీయంగా, ఆర్థికంగా బలిజలు కీలక స్థానాల్లో ఉండాలన్నారు. నల్లగట్ల బాబయ్య, నరసింహుడు, రాందాస్, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పరీద్‌బాషా రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు కోటయ్య తెలిపారు. పీడీ దావూద్, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్ పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో ప్రధానోపాధ్యాయులు

మాపై ఆరోపణలా..?: తెదేపా

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో అన్ని రకాల తప్పులు చేసిన వైకాపా నాయకులు ఇప్పుడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని తెదేపా మండల కన్వీనరు హరికుమార్‌రెడ్డి విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకులు ఆళ్లగడ్డలో ఇసుకను దోపిడీ చేసి రూ.లక్షల కోట్ల మానా చెల్లించిన సంగతిని ప్రజలు మరిచిపోలేదన్నారు. మాజీ జడ్పీటీసీ సుద్దపల్లె చాంద్‌బాషా, తెదేపా నాయకులు రామ్మోహన్‌రెడ్డి, సింగం భరత్‌రెడ్డి, బిజ్జం సుధాకర్‌రెడ్డి, జిలాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మార్గం

డోన్, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కోట్ల తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎవరికైనా ఏ సమస్యలు వచ్చినా ఇక్కడికి వచ్చి తెలియజేయవచ్చన్నారు. లక్ష్మిసాగరం లక్ష్మిరెడ్డి, విజయభట్టు, పెద్దకేశవయ్యగౌడ్ పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే కోట్ల తదితరులు

సిమెంట్‌నగర్(బేతంచెర్ల): సిమెంట్‌నగర్ గ్రామాభివృద్ధికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సిమెంట్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వచ్చిన ఆయన మాట్లాడారు.

ప్యాపిలి: మండల పరిషత్ కార్యాలయానికి మంగళవారం ఉదయం 10 గంటలకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి రానున్నట్లు ఎంపీడీవో సుబ్బరాజు ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణలో పాల్గొంటారని తెలిపారు.

గుండ్రమానివెన్నె(శిరివెళ్ల): కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సువర్ణలత పేర్కొన్నారు. గుంప్రమానిదిన్నెలోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం తనిఖీ చేసి సూచనలు చేశారు.

బనగానపల్లె: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అవుకు: రామాపురంలో ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రధాన కూడళ్లలో, రహదారి వెంట, నాపరాతి పరిశ్రమల సముదాయాల వద్ద పది వరకు కెమెరాలను అమర్చినట్లు తెలిపారు.

కోవెలకుంట్ల: జమ్మలమడుగు నుంచి అనుమతులు లేకుండా కోవెలకుంట్లకు ఇసుకను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి సోమవారం తెలిపారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలోని సంతమార్కెట్లో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందడంతో పట్టణానికి చెందిన గోపిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి అలియాస్ విక్కీ ఆ మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

సంజామల: ప్రభుత్వం అందించే రాయితీ శనగ విత్తనాలను మంగళవారం నుంచి పొందేందుకు రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడారు.

ఆళ్లగడ్డ: డిగ్రీలో చేరికలకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రధానాచార్యులు జి.శివరామయ్య తెలిపారు. ఈ నెల 7 నుంచి 12 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: రోడ్డుపై నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సీఐ మంజునాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం ప్రైవేటు పాఠశాలల బస్సులను, డ్రైవర్లను కూకాల మైదానానికి రప్పించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

డోన్‌పట్టణం: పురపాలిక పరిధిలో వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం వహించొద్దని కమిషనర్ ప్రసాద్‌గౌడ్ పేర్కొన్నారు. పాతబస్టాండు, కూరగాయల మార్కెట్, దేవినగర్, కర్నూలు రోడ్డు ప్రాంతాలను సోమవారం ఆయన సందర్శించారు.

డోన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బేతంచెర్ల: అమ్మవారిశాలలో వెలసిన వాసవీమాతను దసరా నవరాత్రుల్లో భాగంగా డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సోమవారం రాత్రి దర్శించుకున్నారు.

బేతంచెర్ల: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి 8 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఫజిల్ రహమాన్ తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే: రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిని మాజీ డీసీసీ బీఎన్‌బాలు ఆయన స్వగ్రామంలో సోమవారం కలిశారు.

బేతంచెర్ల: పట్టణంలోని గాడుబావి వీరాంజనేయ స్వామి స్థలం సమీపంలోని 413, 416 సర్వే నంబర్లకు సంబంధించి సర్వే నిర్వహించాలని పట్టణానికి చెందిన పిట్టల జాకీర్ కలెక్టరుకు విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సర్వేచేపట్టారు.

డోన్: డోన్ ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డిని కమలాపురం ఎంపీడీఓ ఉమాదేవి, నోడల్ అధికారి నాగేశ్వర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

మిట్టపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం): మిట్టపల్లెలో ఓబులేసు(60) మద్యానికి బానిసై...జీవితంపై విరక్తితో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

అ వీ... ఇ వీ... అ న్నీ..

శనగవైపు... రైతు చూపు


రాయితీ విత్తనాలు రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయాధికారులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గతేడాది రబీలో శనగ రైతు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు లేక సాగు చేసిన పంటంతా ఎండిపోయి దిగుబడులు రాక అల్లాడిపోయారు. ఈసారి రబీలోనైనా పంట పండుతుందేమోనని ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల కురిసిన వర్షం శనగకు అనుకూలించడంతో విత్తుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం కూడా సకాలంలో రాయితీపై శనగ విత్తనాన్ని అందించే ప్రక్రియను చేపట్టింది.

అధిక విస్తీర్ణం: కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలు ఉన్నాయి. రబీలో ఈ మండలాల్లోని రైతులు శనగను ఎక్కువగా సాగు చేస్తారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 41,202 హెక్టార్లలో సాధారణ సాగు ఉంది. గతేడాది వర్షాలు లేని కారణంగా శనగ సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. కేవలం 27,865 హెక్టార్లలో మాత్రమే పంట సాగు జరిగింది. ఈ యేడాది వర్షాలు బాగా కురుస్తుండటం, నదులు, కాల్వల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు శనగ సాగుకు సిద్ధమవుతున్నారు. దసరా మాగిశాక విత్తుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం కూడా సకాలంలో రాయితీపై విత్తన పంపిణీ ప్రక్రియను చేపట్టింది.

శనగ పంట సాధారణ సాగు, విత్తన కేటాయింపులు:		
మండలం	సాధారణ సాగు (హెక్టార్లలో)	విత్తన కేటాయింపు
కోవెలకుంట్ల	8,969	2,313
సంజామల	10,041	3,512
అవుకు	2,171	2,021
కొలిమిగుండ్ల	4,397	2,480
దొర్నిపాడు	4,053	677
ఉయ్యాలవాడ	11,571	1,500

25 శాతం రాయితీపై విత్తనం: శనగను సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం 25 శాతం రాయితీపై విత్తనాలను అందించే ప్రక్రియను చేపట్టింది. విత్తనం ధర క్వింటా రూ.9,400 కాగా 25 శాతం రాయితీ (రూ.2,350) పోనూ రూ.7,050లు రైతులు చెల్లించాలి. ఆరెకరాకు ఒక బస్తా (బస్తా 20 కిలోలు), ఎకరాకు 2 బస్తాలు, 5 ఎకరాలు ఆపై ఉన్నవారికి 10బస్తాల వరకు మాత్రమే ఇవ్వనున్నారు. విత్తనం అవసరమైన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆధార్, పట్టాదారు నంబరు, పాసుపుస్తకం తీసుకెళ్లాలి. ఒక్కో కేంద్రంలో వంద క్వింటాళ్ల వరకు రిజిస్ట్రేషన్ కాగానే లోడు తెప్పించి రైతులకు పంపిణీ చేస్తారు.

10 వేల క్వింటాళ్ల వరకు కేటాయించారు

-సుధాకర్, ఏడీఏ, కోవెలకుంట్ల

శనగకు సమయం కావడంతో ప్రభుత్వం 25 శాతం రాయితీపై విత్తనాలను ఇస్తోంది. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఎక్కువగా దీన్ని సాగు చేయనుండటంతో రాయితీ విత్తనం 22వేల క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతానికి 10 వేల క్వింటాళ్లు కేటాయించారు. డిమాండును బట్టి మిగిలినవి సరఫరా చేస్తారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రైతులు రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి.